క్లుప్తంగా

19న కొండాయపాలెం వార్డు సభ్యుని ఎన్నిక

పొదిలి రూరల్: మండలంలోని కొండాయపాలెం 3వ వార్డుకు ఈ నెల 19న ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.శ్రీకృష్ణ పేర్కొన్నారు. అనివార్య కారణాల వల్ల ఖాళీ అయిన లేక మృతి చెందిన సభ్యుల స్థానాలకు ఎన్నిల కమిషన్ ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. కొండాయపాలెం 3వ వార్డు మెంబర్ జొన్నలగడ్డ నాగలక్ష్మి ఉరివేసుకుని మృతి చెందారు. ఈ స్థానానికి మంగళవారం నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, 11న స్క్రూట్నీ, 14న నామినేషన్ల విత్ డ్రా, 19న ఓటింగ్, అదే రోజు మధ్యాహ్నం నుంచి కౌంటింగ్ నిర్వహిస్తామని వివరించారు.

అనుమానాస్పద వ్యక్తులపై బైండోవర్ కేసులు

దర్శి: పట్టణంలో అర్ధరాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న అద్దంకికి చెందిన లక్కా బ్రహ్మయ్య, మేదరమెట్ల సమీపంలోని బొడ్డువారిపాలేనికి చెందిన గండి మరియదాసుపై పోలీసులు అనుమానాస్పద కేసు నమోదు చేశారు. దొంగతనాలు జరగకుండా రాత్రి పూట పోలీస్ గస్తీ నిర్వహిస్తున్న నేపథ్యంలో దొంగలు, అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అందులో భాగంగా ఇద్దరు అనుమానితులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాచర్ల: మండలంలోని ఆకవీడు, అనుమలవీడు గ్రామ సచివాలయా పరిధిలో అర్హత కలిగిన వారు గ్రామ వలంటీర్ల పోస్టుల కోసం ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కవితా చౌదరి సోమవారం తెలిపారు. ఆకవీడు సీ-16లో ఎస్సీ ఒకటి, అనుమలవీడు సచివాలయం పరిధిలో సీ-2, సీ-14, సీ-17 బీసీ మూడు గ్రామ వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. 10వ తేదీన దరఖాస్తులు స్వీకరణ, 11వ తేదీన ఇంటర్వ్యూ, 14న వలంటీర్లకు నియామకపత్రాలు మంజూరు, 16న వలంటీర్లకు మండల స్థాయి ట్రైనింగ్, 17వ తేదీన వలంటీర్లను వాళ్లకు కేటాయించిన స్థానాల్లో నియమించనున్నట్లు చెప్పారు.

ఈకేవైసీ పెండింగ్‌లు పూర్తి చేయాలి

పుల్లలచెరువు: మండలంలోని సచివాలయాల పరిధిలో పీఎం కిసాన్ ఈకేవైసీ పెండింగ్ ఉన్న వారు ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పీఎం కిసాన్‌కు సంబంధించిన రైతులు ఎవరైనా ఈకేవైసీ చేయించుకోకుండా ఉంటే వెంటనే తమ సచివాలయం పరిధిలో చేయించుకోవాలని, రైతులు ఈ విషయం గమనించాలన్నారు. ఈకేవైసీ చేయించుకోకుంటే అనర్హులుగా ఉండిపోతారని హెచ్చరించారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ప్రెసిడెంట్‌గా నర్సిరెడ్డి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ముత్తుముల కల్యాణ మండపం ఆవరణలో సోమవారం నిర్వహించిన ఎల్ఐసీ ఏజెంట్ల నూతన కార్యవర్గ ఎన్నికల్లో పి.నర్సిరెడ్డిని ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా కె.సత్యనారాయణ, సెక్రటరీగా బి.రామకృష్ణయ్య, జాయింట్ సెక్రటరీగా బాలచెన్నయ్యలను ఎన్నుకున్నారు.

కేజీబీవీలో కంటి వైద్యశిబిరం

రాచర్ల: స్థానిక కస్తూరిబా బాలికల పాఠశాలలో అనుమలవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధ్వర్యంలో డాక్టర్ సుదర్శన్‌రెడ్డి సోమవారం కండ్ల కలక వ్యాధిపై వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కండ్లకలక వ్యాధికి సంబంధించిన పరీక్షలు నిర్వహించి మందులతో పాటు కండ్లల్లో వేసుకునే చుక్కల మందు పంపిణీ చేశారు. అనుమలవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజార్ ముత్యాల ప్రసాద్, ప్రిన్సిపాల్ మాలకొండమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ కులాల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటయ్య

గిద్దలూరు రూరల్: బీసీ కులాల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గిద్దలూరుకు చెందిన ఓ.వెంకటయ్యను సోమవారం నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు మిరియం శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ కులాల జేఏసీ అభ్యున్నతి కోసం వెంకటయ్య పాటుపడతానని, ఆయనతో మిరియం శ్రీనివాసులు ప్రతిజ్ఞ చేయించి నియామక పత్రం అందజేశారు.

వార్డుల ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ

బేస్తవారిపేట: మండలంలోని ఐదు పంచాయతీల్లో ఐదు వార్డ్ సభ్యుల నామినేషన్ల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంపీడీఓ ఎస్. చెన్నకేశవరెడ్డి తెలిపారు. ఈ నెల 8-10వ తేదీలోపు నామినేషన్ల స్వీకరణ, 11న పరిశీలన, 14న విత్ డ్రాయల్స్, 19వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అక్కపల్లెలోని 2వ వార్డ్, ఎంపీ చెరువు 8వ వార్డ్, ఖాజీపురం 3వ వార్డ్‌లకు ఎంపీ చెరువు గ్రామ పంచాయతీలో, చెట్టిచర్ల 3వ వార్డ్‌కు, పెద్ద ఓబినేనిపల్లెలో నాలుగో వార్డ్‌కు బేస్తవారిపేట ఎంపీడీఓ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ సొసైటీ ఆధ్వర్యంలో డీప్‌బోర్

పెద్దదోర్నాల: మండల పరిధిలోని చిన్నదోర్నాలలో జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ సొసైటీ అధ్వర్యంలో సోమవారం డీప్‌బోర్ వేశారు. నీటి ఇబ్బందితో బాధ పడుతున్న 200 కుటుంబాలకు డీప్‌బోర్ ఎంతో ఉపయోగపడుతుందని వ్యవస్థాపకుడు గుర్రం శేఖర్ తెలిపారు. సునీత రూత్‌బెర్రీ, పంచాయతీ కార్యదర్శి సునీత పాల్గొన్నారు.

పేదలకు వరాలు.. నవరత్నాలు

- ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఘనత రాజన్నదే
- మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగనే
- ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్
- దర్శి ముస్లిం బజారులో గడప గడపకు మన ప్రభుత్వం


వృద్ధురాలికి ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న నవరత్నాలు పేదల పాలిట వరాలని దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. దర్శి పట్టణంలోని 17వ వార్డు ముస్లింబజారులో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేను స్థానిక ముస్లింలు దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించి హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికి తిరిగి వారికి వస్తున్న ప్రభుత్వ పథకాల గురించి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. వారికున్న సమస్యలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు అందించి వారి కుటుంబాలకు అండగా ఉంటే.. నేడు ఆయన కుమారుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇమామ్‌లు, మౌజానాలకు జీతాలు అందించి తండ్రికి తగ్గ తనయుడిగా మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ ముస్లింలకు అండగా ఉంటుందన్నారు. ఇంటింటికీ అందిస్తున్న పథకాలు, వలంటీర్ల ద్వారా అందిస్తున్న సేవలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాయన్నారు. ఇతర పార్టీలు మూటకట్టుకుని వచ్చినా ప్రజాబలంతో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024లో ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని ఎమ్మెల్యే మద్దిశెట్టి స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ పాణెం మజ్జువలి, ఎంపీపీ సుధాఅచ్చయ్య, కౌన్సిలర్లు మేడం మోహన్‌రెడ్డి, జగన్నాథం మోహన్‌బాబు, తాళ్లూరి బాబూరావు, పెద్దిరెడ్డి నారాయణరెడ్డి, రెహమాన్, పాణెం హుస్సేన్, పుట్ట రవి, గురవయ్య, హరీష్, అంకబాబు, మిల్లర్ బుజ్జి, ఖాశీం బ్రదర్స్, గుంజి వెంకటేశ్వరరెడ్డి, పాణెం వెంకటేశ్, నబీ, చిమటా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ గుడికి ఎమ్మెల్యే మద్దిశెట్టి రూ.50 వేల విరాళం


విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: కురిచేడు మండలం పడమరవీరాయపాలెం గ్రామంలోని ఎల్లమ్మ గుడికి దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ సోమవారం రూ.50 వేల విరాళం అందజేశారు. దేవస్థానం కమిటీ వారికి నగదు అందజేశారు. ఎమ్మెల్యేకి కమిటీ వారు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం


ఎంపీపీకి సమస్యలు చెబుతున్న చిన్న కంభం సర్పంచ్

కంభం: ప్రజాప్రతినిధులు తెలిపే సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ప్రభుత్వ వైద్యశాలలో సాధారణ కాన్పులు చెయ్యకుండా ఎక్కువ మందిని ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారని కంభం సర్పంచ్ బోడయ్య అన్నారు. పేద ప్రజలే ఎక్కువగా ప్రభుత్వ వైద్యశాలలకు వస్తారని, అటువంటి వారికి నాణ్యమైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక వైజంక్షన్ నుంచి బస్టాండు వరకు నిర్మిస్తున్న డ్రైనేజీ కాలువలు ఇష్టానుసారం నిర్మిస్తున్నారని, అధికారులు కొలతలు వేయించి దాని ప్రకారం కాలువలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్నకంభం జగనన్న కాలనీలో నిర్మించిన ట్యాంకులు నాసిరకంగా ఉండటంతో బోరునీళ్లు వృథాగా పోతున్నాయని చిన్నకంభం సర్పంచ్ రసూల్ తెలిపారు. 2019వ సంవత్సరంలో లబ్ధిదారులక ఇచ్చిన ఇంటి స్థలాల్లో కొంతమందికి నేటి వరకు హద్దులు చూపించలేదన్నారు. చిన్నకంభం, పోరుమామిళ్లపల్లి గ్రామ ఇలాఖాలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ కార్యాలయంలో కొందరు వీఆర్వోలు డబ్బులు ఇస్తేనే పని చేస్తున్నారని, చిన్న పనులకు సైతం నెలల తరబడి తిప్పుతూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నార కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం తెలిపారు. ఇరిగేషన్ కాలువల్లో చెత్త, వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్‌కోట పరిధిలో అసంపూర్తిగా నిలిచి ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని పూర్తి చేయాలని సర్పంచ్ మహ్మద్ బాషా తెలిపారు. అన్ని శాఖల అధికారులు సర్వసభ్య సమావేశానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు ఎంపీడీఓను కోరారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీటీసీలు ఆనంద్, రఫీ, నాగరాజు, రవీంద్ర, రామ్మూర్తి, హసీనా, ఖాసింబీ, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరం


తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న సీడీపీఓ జ్యోతి

గిద్దలూరు రూరల్: తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి మహ్మద్ షరీఫ్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని కోటగడ్డ వీధి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు ప్రభుత్వం నుంచి వచ్చిన న్యూట్రీషన్ కిట్‌లు అందజేశారు. ఈ నెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు టీకాలు వేయించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఆవరణలో సీడీపీఓ బి.జ్యోతి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతు తల్లిపాల ప్రాముఖ్యత గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల ఆరోగ్యం కోసం ఉచితంగా పౌష్టికాహారం అందజేస్తోందన్నారు. సూపర్‌వైజర్లు రుబినా, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

త్రిపురాంతకం: అంగన్‌వాడీల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహార కిట్లను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌హెచ్‌పీ జయంతి కోరారు. మండలంలోని రాజుపాలెంలో జరిగిన కార్యక్రమంలో పౌష్టికాహారకిట్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకున్న ప్రతి ఒక్కరికి ఈ పౌష్టికాహార కిట్లు అందజేస్తున్నట్లు వివరించారు. మహిళా సిబ్బంది కొండమ్మ, వసుంధర, రూతు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సీడీపీఓ పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రక్తహీనతను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం టేక్ హోమ్ రేషన్ కార్యక్రమం ప్రవేశ పెట్టినట్లు పేర్కొన్నారు. ఏపీఎం పోలయ్య, సూపర్‌వైజర్లు భార్గవి, అంజమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువుల తయారీని ప్రోత్సహించాలి


జాతీయ జెండా, నూలు వస్త్రాలతో విద్యార్థులు

తర్లుపాడు: స్వదేశీ వస్తువుల తయారీని ప్రోత్సహించడం ద్వారా దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండలంలోని లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మౌలాలి కోరారు. సోమవారం నేషనల్ హ్యాండ్‌లూమ్ డే కార్యక్రమం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్వాతంత్ర్య సమరంలో మహాత్మ గాంధీ నూలు వడికి స్వదేశీ వస్త్రాలు తయారు చేసిన విషయాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు షేక్షావలి, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

బేస్తవారిపేట: ఏపీ ఎన్‌జీవోస్ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను తహసీల్దార్ డీవీబీ వరకుమార్, ఎంపీడీఓ చెన్నకేశవరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ నెల 21, 22వ తేదీల్లో చలో విజయవాడ కార్యక్రమం ఏర్పాటు చేశామని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లోని ఉద్యోగులకు కరపత్రాలు అందజేశారు. ఏపీ ఎన్‌జీవోస్ కంభం తాలుకా అధ్యక్షుడు వి.రాధాకృష్ణ, సెక్రటరీ నిరంజన్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా నమోదుకు సహకరించాలి


మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి రామసుబ్బయ్య

గిద్దలూరు రూరల్: ఓటర్ల జాబితా నమోదు ప్రక్రియలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సహకరించాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి రామసుబ్బయ్య కోరారు. పట్టణంలోని ఓటర్ల జాబితా నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం రాజకీయ పార్టీ నాయకులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీఎల్‌ఓలు ఎన్నికల నిబంధనలు దృష్టిలో ఉంచుకుని ఇంటింటా తిరుగుతూ ఓటర్ల జాబితా సిద్ధం చేస్తున్నారన్నారు. వారికి ప్రతి ఒక్క రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలన్నారు. మీ సలహాలు సూచనలు తెలియజేయాలని కోరారు. 18 సంవత్సరాలు కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండేలా చూడాలన్నారు. తహసీల్దార్లు డి.సీతారామయ్య, వరకుమార్, ఉమారాణి, కమిషనర్ వై.రామకృష్ణయ్య, డిప్యూటీ తహసీల్దార్లు, బీఎల్‌ఓలు, రాజకీయపార్టీ నాయకులు సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సొసైటీ ప్రెసిడెంట్


సొసైటీ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న పోతిరెడ్డి నాగిరెడ్డి

కురిచేడు: కురిచేడు సొసైటీ ప్రెసిడెంట్‌గా మాజీ సర్పంచ్ పోతిరెడ్డి నాగిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని కురిచేడు, పడమరవీరాయపాలెం, నమశ్శివాయపురం సొసైటీలకు ఇటీవల నూతన ప్రెసిండెంట్లను నియమించిన విషయం తెలిసిందే. నూతనంగా ఎంపికైన నాగిరెడ్డి సోమవారం సొసైటీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించి సొసైటీ ద్వారా రైతులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. రైతులు సొసైటీ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

పీడీసీసీబీ చైర్మన్‌కు శుభాకాంక్షలు

కురిచేడు, పడమరవీరాయపాలెం సొసైటీ ప్రెసిడెంట్లు పోతిరెడ్డి నాగిరెడ్డి, మానం కోటయ్య, పెండ్యాల గుర్నాథం, కౌలూరి నరసింహులు సోమవారం ఒంగోలు పీడీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మైఎం ప్రసాదరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అనుమలవీడులో డీఎస్పీ విచారణ


విచారిస్తున్న సీఐ దేవప్రభాకర్

రాచర్ల: మండలంలోని అనుమలవీడు గ్రామానికి చెందిన షేక్ షేక్షావలి నివాస గృహంలో ఏవరూ లేని సమయంలో అతని భార్య షేక్ అయేషాను ఆగంతకులు కత్తులు చూపించి బెదిరించిన ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. సోమవారం సాక్షి దినపత్రికలో పట్టపగలే దోపిడీకి యత్నం..అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి మార్కాపురం డీఎస్పీ జి.వీర రాఘవరెడ్డితో పాటు గిద్దలూరు సీఐ పి.దేవప్రభాకర్ స్పందించారు. అనుమలవీడు గ్రామానికి చెరుకుని షేక్షావలితో పాటు చుట్టు పక్కల నివాసం ఉంటున్న ప్రజలతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం అయేషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.కృష్ణపావని తెలిపారు.

చేనేత వస్త్రాలను వాడాలి


చేనేత వస్త్రాలపై అవగాహన కల్పిస్తున్న ఎంఈవో శామ్యూల్ జాన్

పుల్లలచెరువు: ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు వాడటం అలవాటు చేసుకోవాలని ఎంఈవో-1,-2 శామ్యూల్‌జాన్, ఇందిరప్రసాద్ అన్నారు. సోమవారం జాతీయ చేనేత వస్త్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాలపై మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పుల్లలచెరువులోని పాఠశాలలో ఎంఈవోలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చేనేత కార్మికులను ప్రోత్సహిస్తూ చేనేత వస్త్రాలు ధరించాలన్నారు. అనంతరం విద్యార్థులతో చేనేత వస్త్రధారణ చేయించి చేనేత వస్త్రాలపై అవగాహన కల్పించారు. హెచ్ఎంలు ఉమామహేశ్వరరావు, కీర్తి, కోటేశ్వరరావు, జానీబాషా పాల్గొన్నారు.

త్రిపురాంతకం: నేషనల్ హాండ్ లూమ్ డేను శాఖ గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. త్రిపురాంతకం గ్రంథాలయం నుంచి చిన్నారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథ పాలకురాలు కె.ఝాన్సీ మాట్లాడుతూ హాండ్‌లూమ్ ప్రాముఖ్యత, శ్రమను వివరించారు.

పొదుపు గ్రూపుల డిపాజిట్లు గల్లంతు


విచారణ చేస్తున్న ఏపీజీబీ ఆర్ఎం శ్రీనివాస ప్రసాద్

యర్రగొండపాలెం: స్వయం సహాయక సంఘాలు బీసీ పాయింట్‌లో జరుపుతున్న లావాదేవిల్లో ఆ పాయింట్ నిర్వాహకుడు చేతివాటం చూపినట్లు వెల్లడయింది. త్రిపురాంతకంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు వ్యాపార ప్రతినిధి (బీసీ పాయింట్) గుంటక వెంకటరెడ్డి యర్రగొండపాలెం మండలంలోని సేవింగ్ డిపాజిట్లు, రుణాల లావాదేవీలకు సంబంధించిన డబ్బులను స్వాహా చేశాడు. ఈ మేరకు సోమవారం ఏపీజీబీ మార్కాపురం రీజనల్ మేనేజరు కె.శ్రీనివాసప్రసాద్, డీఆర్‌డీఏ నోడల్ అధికారి ఈ.మనోజ్, ఏరియా కో ఆర్డినేటర్ కె.లక్ష్మీరెడ్డి తమ సిబ్బందితో నరసాయపాలెం వెళ్లి దర్యాప్తు చేపట్టారు. నరసాయపాలెం, గంగపాలెం గ్రామాల్లో మొత్తం 56 స్వయం సహాయక సంఘాలు ఉండగా వాటిలో 21 సంఘాల లావాదేవీలను పరిశీలించి రూ.1,77,600లు బ్యాంకుకు జమ కాలేదని, మిగిలిన 35 సంఘాల లావాదేవీలను పరిశీలించాల్సి ఉందని ఏరియా కో ఆర్డినేటర్ తెలిపారు. స్వయం సహాయక సంఘాల అకౌంట్‌లను పరిశీలించిన వారిలో ఏపీఎం ఆర్.కృపమ్మ, లీగల్ కో ఆర్డినేటర్ ఎం.వెంకయ్య, సీసీ ఇబ్రహీం ఉన్నారు.

కషాయాల పాత్రపై అవగాహన

పెద్దదోర్నాల: మండల పరిధి రామచంద్రకోటలో సోమవారం జరిగిన కార్యక్రమంలో చిన్నదోర్నాల యూనిట్‌లో బ్రహ్మాస్త్రం తయారు చేశారు. ఎకరానికి మూడు లీటర్ల బ్రహ్మాస్త్రం 120 లీటర్ల నీటిలో కలిపి పురుగులపై పిచికారీ చేయాలని ఏపీ సీఎం ఆఫ్ సిబ్బంది శ్రీనివాసరెడ్డి సూచించారు. అంబటి తిరుపతిరెడ్డి, ఆగయ్య, శ్రీనివాసులు, వెంకటరెడ్డి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

బెదిరింపులపై మహిళ ఫిర్యాదు

దర్శి: తన సెల్ నంబర్ బలవంతంగా తీసుకుని ప్రతిరోజూ కాల్ చేసి బెదిరిస్తున్నాడంటూ ఆమని అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూరంగి చిన్న నరసింహులు అనే వ్యక్తిపై ఏఎస్సై శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అసభ్యంగా కూడా మాట్లాడుతున్నాడంటూ ఆమని ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

సంక్షిప్తంగా

దాడి కేసు నమోదు

ముండ్లమూరు: మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన మందలపు నర్సయ్యపై అదే గ్రామానికి చెందిన మందలపు వెంకటేశ్వర్లు, భార్య ఆదిలక్ష్మి, కుమార్తె విజయరాణి దాడి చేసి గాయపరిచారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణయ్య తెలిపారు. రెండు రోజుల క్రితం నర్సయ్యకు, వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు దారి విషయంలో జరిగిన గొడవలో వెంకటేశ్వర్లు, అతని కుటుంబ సభ్యులు దాడి చేయగా తలకి గాయం కావడంతో నర్సయ్య అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చేరారు. సోమవారం వైద్యశాల నుంచి వచ్చిన రిపోర్టు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భూ కబ్జాలపై చర్యలు తీసుకోవాలి

ముండ్లమూరు: రిజిష్టర్ భూమిని కబ్జాకు ప్రయత్నిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్పందన కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పుల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు. మండలంలోని బృందావనం రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 59-2లో సిరిమల కోటమ్మకు 18 సెంట్ల రిజిష్టర్ భూమి ఉండగా, కొందరు ఆక్రమణకు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీసీ సంక్షేమ సంఘ జిల్లా కార్యదర్శి, పీడీసీసీబీ డైరెక్టర్ అన్నవరం వెంకటేశ్వర్లు, రాష్ట్ర దళితసేన నియోజకవర్గ కార్యదర్శి గొర్నెపూడి ప్రేమ్‌కుమార్, బాధితురాలు సిరిమల్లె కోటమ్మ ఉన్నారు.

నాగార్పమ్మ ఆలయంలో మద్దిశెట్టి రవీంద్ర పూజలు


మద్దిశెట్టి రవీంద్రను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

తాళ్లూరు (ముండ్లమూరు): తాళ్లూరు మండలంలోని రజానగరం గ్రామంలో నూతనంగా నిర్మించిన నాగార్పమ్మతల్లి ఆలయంలో దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరుడు మద్దిశెట్టి రవీంద్ర సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు సన్మానించారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ ఎడమకంటి వెంకటేశ్వరరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు కరిముల్లా, సర్పంచ్ వలి, ఎంపీటీసీ పులి వీరాస్వామి, బెల్లంకొండవారిపాలెం సర్పంచ్ పోశం సుమలతాశ్రీకాంత్‌రెడ్డి, నాయకుడు విష్ణు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి నిత్యావసరాలు అందజేత

మార్కాపురం రూరల్: మండలంలోని గజ్జలకొండ ఎస్సీ పాలెంలో వృద్ధురాలైన జమ్మలమడుగు బాలనాగమ్మకు నెల రోజులకు సరిపడా బియ్యం, కందిపప్పు తదితర నిత్యావసర వస్తువులను దాతలు కటకం రాము, ఇమ్రాన్ సహకారంతో హోంగార్డు చెన్నుపల్లి కాశయ్య సోమవారం అందజేశారు. వృద్ధురాలైన బాలనాగమ్మ మట్టిగోడలపై పట్టాలు కప్పుకొని నివాసముంటోందని, దాతలు ఎవరైనా స్పందించి ఆర్థిక సాయం అందించాలని కాశయ్య కోరారు.

ఏఆర్ ఎస్ఐగా జ్యోతి ఎంపిక



కొమరోలు: తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఐ ఫలితాల్లో మండలంలోని ద్వారకచర్ల గ్రామానికి చెందిన బొడ్డు జ్యోతి సత్తా చాటారు. ఇటీవల విడుదలైన తెలంగాణ ఏఆర్ ఎస్ఐ ఫలితాల్లో ఆమె కొలువు చేజిక్కించుకుంది. 2022 ఏప్రిల్లో విడుదల చేసిన ఎస్సై నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న బొడ్డు జ్యోతి ప్రిలిమ్స్‌లో సెలక్ట్ అయి ఈ ఏడాది ఏప్రిల్ 8, 9 తేదీల్లో నిర్వహించిన పరీక్షల్లో ఎంపికై ఏఆర్ ఎస్ఐగా ఉద్యోగం పొందింది. తిరుపతిలోని ఓ ప్రైవేటు సైనిక్ పాఠశాలలో పీఈటీగా ఉద్యోగం చేస్తూనే ఎస్ఐ శిక్షణ పొందినట్లు జ్యోతి తెలిపింది. తన తల్లి లక్ష్మీదేవి ప్రోత్సాహంతో ఎస్ఐగా ఎంపికైనట్లుగా పేర్కొంది.

ఇద్దరి మధ్య ఘర్షణ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎగువరామాపురానికి చెందిన చిన్న కాశన్న, కె.ఎస్.పల్లెకు చెందిన అబ్దుల్ సలీంలకు రెస్టారెంట్‌లో మాటామాటా పెరిగి ఘర్షణ ఏర్పడింది. ఈ నేపథ్యంలో కాశన్నను అబ్దుల్ సలీమ్ తలపై గాయపరిచాడు. కాశన్నను చికిత్స కోసం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

నేడు మంత్రి ఆదిమూలపు సురేష్ పర్యటన

యర్రగొండపాలెం: మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మంగళవారం యర్రగొండపాలెంలో పర్యటించనున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.